



ఆసుపత్రిలో చికిత్సకు చేరిన విద్యార్థినులు

పెండింగ్ కేసులపై నిర్లక్ష్యం వీడాలి

ఎస్పీ మాధవరెడ్డి

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

పెండింగ్ కేసుల విషయంలో నిర్లక్ష్యం వహించరాదని జిల్లా ఎస్పీ మాధవరెడ్డి పోలీసులకు సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని నెలవారి నేర సమీక్షపై జూమ్ కాన్ఫరెన్స్‌లో జిల్లా పోలీసులతో ఆయన గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. రాబోవు ఎన్నికల దృష్ట్యా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. కేసుల దర్యాప్తులో సాధారణ, తీవ్రమైన కేసులు, ప్రాపర్టీ కేసులు, పోక్సో యాక్ట్ కేసులు, గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులు, గంజాయి కేసులు, మిస్సింగ్ కేసుల విషయంలో జరుగుతున్న దర్యాప్తు తీరును సంబందిత పోలీస్ అధికారులతో ఆరా తీశారు. కేసులు పెండింగులో ఉండడానికి గల కారణాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన దర్యాప్తు చేయాలని, క్రిమినల్స్ తదితర కేసులపై ఇన్వెస్టిగేషన్ వేగవంతం చేయాలని ఆదేశించారు. ముఖ్యమైన కేసులు ,రౌడీ షీటర్లు ,కబ్జా నేరాలకు పాల్పడిన కేసులు, గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్న కేసులతో పాటు ఇతర ముఖ్యమైన కేసుల గురించి ప్రతిరోజు సమీక్షించాలన్నారు. కేసుల విచారణలో సమయంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో సమన్వయం చేసుకొని నిర్ణీత సమయంలో నిందితులకు శిక్షలు పడే విధంగా చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించారు. జిల్లాలో అపరిచిత వ్యక్తులు కదలికలపై పోలీసు అధికారులు దృష్టి సారించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు నేషనల్ హైవే, స్టేట్ హైవేల్లో హైవే మొబైల్స్ ద్వారా ట్రాఫిక్ క్రమబద్ధీకరించడంతోపాటు రోడ్డు ప్రమాదాలు జరగకుండా నివారణ చర్యలు చేపట్టాలన్నారు. పెండ్లీ పోలీసింగ్ విధానాన్ని పాటించాలన్నారు. మహిళలు చిన్నారులకు సంబంధించిన పిటిషన్లపై తక్షణమే స్పందించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ విష్ణు, ఎస్‌బి సిఐ రవీంద్రారెడ్డి , డిసిఆర్‌బి సిఐ శ్రీ హర్ష, సతీష్ బాబు, లీగల్ అడ్వైజర్ సాయినాథ్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు నగదు బహుమతులు

పుట్టపర్తి క్రైమ్ : పుట్టపర్తి ఆర్టీసీలో ఆదాయం తెచ్చిన కండక్టర్లు, ఆయిల్ ఆదా చేసిన డ్రైవర్లకు నగదు బహుమతులు అందజేసినట్లు డిపో మేనేజర్ ఇనయతుల్లా తెలిపారు. స్థానిక ఆర్టీసీ డిపోలో గురువారం జరిగిన అభినందన సభలో కండక్టర్లు సురేష్, శ్రీనివాసులు, మహేంద్ర, శ్రీరాములు, డ్రైవర్లు టి.శ్రీనివాసులు, ఇ.నాగేంద్ర, ఎస్.కేశప్ప బహుమతులు అందుకున్నారు. కార్యక్రమంలో ఎస్‌టిఐ పెద్దన్న, సూపర్‌వైజర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యార్థుల గోడు అరణ్య రోదనే...

పట్టించుకోని బెస్టు యాజమాన్యం
అనుమతుల్లేని భవనంలోనే క్యాంపస్



అనంతపురంలోని క్యాంపస్ ముందు నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

బెస్టు యూనివర్శిటీ యాజమాన్యం విద్యార్థుల సమస్యను పట్టించుకుంటున్న దాఖలాల్లేవు. అనంతపురం నగరంలోనే క్యాంపస్ ఉంటుందని చెప్పి అడ్మిషన్లు చేసుకున్నాక..మకాంను తిరిగి గోరంట్ల మండలం గౌనివారిపల్లి గ్రామానికి తరలించే ప్రయత్నంలో వెనుకడుగు వేసిన దాఖలాల్లేవు. విద్యార్థులు వారం రోజులుగా నిరసనలు చేపట్టినా జిల్లా కలెక్టరు దృష్టికి తమ సమస్యను తీసుకెళ్లినా ఫలితం కనిపించడం లేదు. ఎందుకంటే ప్రయివేటు యూనివర్శిటీలపై స్థానికంగా ఎవరి అజమాయిషీ ఉండే అవకాశం లేదు. కేంద్ర ప్రభుత్వ స్థాయిలోనే జరగాల్సి ఉంది. దీంతో యజమాన్యం ఇష్టమెచ్చినట్టుగా వ్యవహరిస్తోంది. దీంతో విద్యార్థుల భవితవ్యం అగమ్య గోచరంగా మారింది.

విద్యార్థులతో ఒక మాట... యుజిసి వద్ద మరో మాట

విద్యార్థులకేమో అనంతపురం జిల్లా కేంద్ర పరిధిలోని అక్కంపల్లి వద్దనున్న ఒక ప్రయివేటు ఇంజనీరింగు కళాశాల భవనాన్ని క్యాంపస్‌గా చూపించింది. అయితే యూజిసి పరిశీలనకు వచ్చినప్పుడు మాత్రం గోరంట్లలోని గౌనివారిపల్లిలో చూపించింది. 2022 జులై నెలలో యూజిసి కమిటీ యూనివర్శిటీని తనిఖీ చేసి అంతా భేష్‌గా ఉందని కితాబునిచ్చింది. తాము సంతృప్తిగానున్నట్టు కమిటీ ముందు విద్యార్థులు చేప్పే విధంగా ఏర్పాట్లు చేశారు. అయితే వాస్తవ పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా ఉంది. విద్యార్థులు గౌనివారిపల్లిలో ఎటువంటి సౌకర్యాలు లేవని ఇబ్బందులు పడుతున్నారు. ఇదే విషయాన్ని విద్యార్థులు చెబుతున్నారు.

అనుమతుల్లేని భవనంలో క్యాంపస్

అనంతపురం నగరంలో ఇప్పుడు నడుస్తున్న క్యాంపస్ ఒక ప్రయివేటు ఇంజనీరింగు కళాశాలకు సంబంధించినది. ఇంటెల్ ఇంజనీరింగు కళాశాల భవనమది. ఇప్పటికీ అదే కళాశాల పేరుతోనే భవనముంది. ఒకవేళ ఈ భవనం మరో కార్యకలాపాలకు వినియోగించాలంటే ఇంటెల్ యాజమాన్యం అనంతపురం జెఎన్‌టియుకు క్లోజర్ నోటీసును అందజేయాల్సి ఉంటుంది. ఇక తాము ఈ భవనంలో కళాశాల నిర్వహించడం లేదని తెలియజేయాల్సి ఉంటుంది. కాని ఇప్పటికీ ఆ యాజమాన్యం జెఎన్‌టియుకు అటువంటి సమాచారమేదీ ఇవ్వలేదు. అటువంటి భవనంలోనే ఇప్పుడే బెస్టు యూనివర్శిటీ క్యాంపస్ ఏ రకంగా నిర్వహిస్తోందన్నది ప్రశ్నార్థకంగా మారింది. దీనికి ప్రభుత్వం వైపు నుంచి ఎటువంటి అనుమతులు ఉన్నాయన్నది కూడా ప్రశ్నార్థకంగా మారింది.

ప్రయివేటు యూనివర్శిటీలపై పర్యవేక్షణ పెరగాలి

కేంద్ర ప్రభుత్వం ఇబ్బడి ముబ్బడిగా ప్రయివేటు యూనివర్శిటీలకు అనుమతులిచ్చింది. అయితే ఈ యూనివర్శిటీల్లో విద్యా ప్రమాణాలు, నిబంధనలను ఏ రకంగా పాటిస్తున్నాయన్నది చూడటం లేదు. అటువంటి సమగ్రమైన వ్యవస్థ ఏదీ లేదు. ఇది విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడటమే. ఇప్పటికైనా యూనివర్శిటీలపై పర్యవేక్షణ పెంచాలి. వాటి నిర్వహణపై దృష్టి సారించి, తగిన చర్యలు తీసుకోవాలి.

పరమేష్ ,
జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ఎఫ్ఐ

కదిరి ప్రభుత్వ పాఠశాలలో
30 మంది విద్యార్థినులకు అస్వస్థత

ప్రజాశక్తి కదిరి టౌన్

సత్యసాయి జిల్లా కదిరి పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న 30 మంది విద్యార్థునులు గురువారం అస్వస్థతకు గురయ్యారు. పాఠశాలలో మధ్యాహ్నం భోజనం సమయంలో ఉపాధ్యాయులు తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థినులతో పాఠశాల ఆవరణంలో పరిశుభ్రత పనులు చేయించారు. పాఠశాల గదిలో ఏర్పాటు చేసుకున్న పిచ్చుక గూళ్లతో పాటు పాఠశాల ఆవరణంలోని పరిసరాలను విద్యార్థినులు శుభ్రం చేయిస్తుండగా ఒక్కసారిగా తేనెటీగలు వారిని చుట్టిముట్టాయి. మొదట ఒక విద్యార్థిని చర్మంపై దద్దుర్లు వచ్చాయి. ఆ తరువాత మొత్తం 30 విద్యార్థినులకు దుద్దుర్లు వచ్చి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఉపాధ్యాయులు విద్యార్థినులను హుటాహుటిన కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి ఆటోలో తరలించారు. విషయం తెలుసుకున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్, సిపిఎం పట్టణ కార్యదర్శి జివిఎల్ నరసింహులు, వైసిపి నాయకులు సాదిక్‌బాషా, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బాబ్జాన్ తదితరులు ఆసుపత్రి వద్ద విద్యార్థినులను పరామర్శించారు. అస్వస్థతకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యతనిస్తున్నామని నాడు నేడు పనులు ద్వారా కార్పొరేట్ స్థాయి ప్రమాణాలతో పాఠశాలలో మెరుగైన వసతులు కల్పిస్తున్నామని ప్రభుత్వం ప్రగల్బాలు పలుకుతోందన్నారు. గురువారం పాఠశాలలో జరిగిన ఘటనకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డాక్టర్లు విద్యార్థులకు ఆసుపత్రిలో చికిత్స మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు.

గత ఏడాది ఇదే పరిస్థితి

గత ఏడాది ఇదే నెలలో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నలుగురు విద్యార్థినులు పనులు చేస్తున్న సమయంలో దద్దుర్లు వచ్చాయి. అప్పట్లో పట్టణంలోని ఒక ప్రవేటు ఆసుపత్రిలో మూడు రోజుల పాటు చికిత్స అందించారు. ఏడాది తర్వాత అలాంటి ఘటనే చోటు చేసుకొని 30 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురై ఆసుపత్రి పాలయ్యారు. ప్రభుత్వ పాఠశాలలో సిబ్బంది ఉన్నప్పటికీ విద్యార్థినుల చేత పనులు ఎందుకు చేస్తున్నారని విద్యార్థినుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఈ ఘటనపై పాఠశాల హెచ్ఎం స్పందిస్తూ తాము విద్యార్థినులచేత ఎలాంటి పనులు చేయించలేదని, విద్యార్థినులు అస్వస్థతకు గురైన సమయంలో అక్కడ ఎలాంటి తేనెటీగలు లేవని అన్నారు.



రాగి కొనుగోలుపై అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్

రాగి పంట సాగు విస్తీర్ణాన్ని పెంచాలి

రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ అరుణ్‌కుమార్

ప్రజాశక్తి-సోమందేపల్లి

రైతులు రాగి పంట విస్తీర్ణాన్ని పెంచి ఎక్కువ ఉత్పత్తిని సాధించాలని రాష్ట్ర పౌరసరఫరాల కమిషనర్ హెచ్. అరుణ్ కుమార్ సూచించారు. శ్రీ సత్యసాయి జిల్లా పర్యటనలో భాగంగా గురువారం మధ్యాహ్నం సోమందేపల్లి మండలం గుడిపల్లిలోని రైతు భరోసా కేంద్రాన్ని పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తిక్ తో కలిసి ఆయన పరిశీలించారు. రాగి పంట విస్తరణపై అవగాహన కార్యక్రమాల గురించి రైతులను, అధికారులను అడిగి తెలుసుకున్నారు. రాగి ధాన్యం కొనుగోలుపై రైతులతో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన రాగిని రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం మద్దతు ధర క్వింటాలకు రూ.3846లు అందిస్తోందని చెప్పారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులకు ఎలాంటి ఖర్చులు లేకుండా ప్రభుత్వమే ఉచితంగా గోనెసంచులు సరఫరా చేసి హమాలీ, ఇతర రవాణా కూలి ఖర్చులను కూడా భరిస్తుందని కమిషనర్ రైతులకు వివరించారు. ప్రభుత్వం రాగి కొనుగోలు చేసిన రెండు రోజుల్లోనే రైతు ఖాతాకు నేరుగా సొమ్ము జమ చేయబడుతుందని తెలిపారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో ఇప్పటివరకు ఈ జిల్లాకు చెందిన 110 మంది రైతుల నుండి 900 క్వింటాళ్ల రాగులను కొనుగోలు చేసినట్లు తెలిపారు. రైతులు తమ పంటను విక్రయించడానికి దళారులను ఆశ్రయించి మోసపోవద్దనిసూచించారు. ఈ జిల్లా అవసరాలకు సరిపడా రాగులను ఇతర రాష్ట్రాల నుంచి కాకుండా ఇక్కడే ఉత్పత్తి చేసిన రైతుల ద్వారానే కొనుగోలు చేసి ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అందించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. రాష్ట్రంలో 62శాతం పైగా ప్రజలు వ్యవసాయం దాని అనుబంధ రంగాలపై ఆధారపడి జీవిస్తున్నారని అన్నారు. రైతులు తమ రాగి పంట కొనుగోలుకు అధికారులకు సహకరించాలని కోరారు. వ్యవసాయ పౌర సరఫరా అధికారులు రైతులను భాగస్వామ్యం చేసి రాగి పంట విస్తీర్ణాన్ని పెంచేందుకు అన్ని విధాల తోడ్పాటు అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ అశ్వర్థ నాయక్, జిల్లా సహకార అధికారి కృష్ణ నాయక్, సోమందేపల్లి తహశీల్దార్ సురేష్, ఎఎస్‌ఒలు ప్రభావతి, సింధు, ఎడిఎ స్వయంప్రభ, వ్యవసాయ అధికారి కవిత రాణి, సింగిల్ విండో చైర్మన్ కొల్లప్ప, సర్పంచి గిరిజమ్మ నాగరాజు రావ్, వ్యవసాయ, పౌరసరఫరాల, సచివాలయ సిబ్బంది, స్థానిక నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం.... ప్రజలకు కష్టాలు...



వైసిపి నాయకుల ర్యాలీతో స్తంభించిన ట్రాఫిక్

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్ పర్సన్ ప్రమాణ స్వీకార కార్యక్రమం ప్రజలకు కష్టాలు తెచ్చింది. హిందూపురం వ్యసాయ మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ ప్రమాణ స్వీకార కార్యక్రమం అధికార పార్టీ నాయకులు గురువారం ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా పట్టణంలో కార్లు, ద్విచక్ర వాహనాలతో భారీ ర్యాలీ చేపట్టారు. వైసిపి ఇన్‌చార్జ్ దీపికమ్మ కోసం దాదాపు 30 నిమిషాల పాటు ప్రధన కూడలి రహమత్ పురం సర్కిల్‌లో ఆపినారు. దీంతో లేపాక్షి, బైపాస్, రైల్వే రోడ్డు ఇలా నాలుగు వైపుల నుంచి వస్తున్న వాహనాలు ఆగిపోయాయి. ట్రాఫిక్ జామ్ అవుతుందని...కనీసం రోడ్డుకు ఒక వైపు వాహనాలను నిలపాలని ట్రాఫిక్ పోలీసులు కోరినా ఫలితం కన్పించలేదు. పైపెచ్చు పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై రోడ్డుపై ఎవరైన ఆందోళన కార్యక్రమాలు చేస్తే ఆగ్రహాన్ని వ్యక్తం చేసి, వారిని ఈడ్చి పారేసే పోలీసులు ఇప్పుడు వేడుక చూసినట్లు చూస్తు ఉండడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

వ్యవసాయమే తెలియని మహిళకు మార్కెట్ కమిటీ భాధ్యతలు

సహపంక్తి భోజనాల సమయంలో వడ్డించే వాడు మనోడు అయితే ఎక్కడ కుర్చోంటే ఏమి అన్న చందంగా అధికార పార్టీ తీరు ఉంది. రాష్ట్రంలోనే అతి పెద్ద చింత పండు ఎగుమతి అయ్యే హిందూపురం వ్యవసాయ మార్కెట్ కమిటీని చాలా కాలంగా ఏర్పాటు చేయలేదు. చివరకు మార్కెట్ చైర్‌పర్సన్ పదవి ఒక బిసి మహిళకు రిజర్వు చేశారు. కమిటీ చైర్మన్‌కు విద్యార్హత లేకున్నా తప్పని సరిగా వ్యవసాయ భూమి లేదా పశుగణం తప్పని సరిగా ఉండాలి.అయితే నియోజక వర్గంలో ఎంతో మంది వ్యవసాయంపై అవగాహన ఉన్న వారున్నా వారికి ఎవరికి కేటాయించకుండా వ్యవసాయంపై కనీస అవగాహన లేని మహిళతో గురువారం ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆమె వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పదవికి సమర్పించిన దరఖాస్తులో జీవనోపాధి కోసం తనకు 2 బర్రెలు, 15 గొర్రెలు ఉన్నాయని, దీని ద్వారా పాలను ఉత్పత్తి చేసి పాలడైరీకి వేస్తున్నానని పేర్కొన్నారు. అందుకు సంబందించి పశు సంవర్ధక శాఖ డిప్యూటి డైరెక్టర్ ధృవీకరించిన పత్రాన్ని సమర్పించారు. అయితే వీరికి బర్రెలు, గొర్రెలు, మేకలు ఎక్కడ ఉన్నాయి, కనీసం పాలు పితకడం అన్నా తెలుసా అని ప్రమాణ స్వీకరానికి వచ్చిన కొంత మంది రైతులు వ్యాఖ్యానించారు. వ్యవసాయంపై అవగాహన లేని చైర్‌పర్సన్ మార్కెట్‌కు వచ్చే రైతుల సమస్యలను ఎలా పరిష్కరిస్తారో అర్థం కావడం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

దీపికమ్మ కోసం అరగంట ఆగిన ర్యాలీ...
వ్యవసాయమే తెలియని మహిళకు మార్కెట్‌యార్డ్ చైర్మన్ గిరి

మార్కెట్ యార్డును అన్ని విధాల అభివృద్ధి చేస్తాం

హిందూపురం మార్కెట్ యార్డుకు రాష్ట్రంలోనే మంచి గుర్తింపు ఉందని దీనిని మరింత అభివృద్ధి చేస్తామనివైసిపి ఇన్‌చార్జ్ దీపిక అన్నారు. గురువారం హిందూపురం వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్‌పర్సన్‌గా ఫిర్దోస్ బాను, వైస్ చైర్మేన్‌గా మహేంద్రనాథ్ రెడ్డి, నూతన కమిటీ ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి వైసిపి ఇన్‌చార్జ్ దీపికతో పాటు మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘనీ, మాజీ సమన్వయకర్త వేణుగోపాల్ రెడ్డి, మధుమతి, వేణురెడ్డిలు ముఖ్య అతిథిలుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా దీపిక మాట్లాడుతు మార్కెట్ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులతో ఇన్‌చార్జ్ సెక్రటరీ కిశోర్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు జబివుల్లా, బలరామిరెడ్డి, కౌన్సిలర్లు, నియోజక వర్గ వ్యాప్తంగా ఉన్న ప్రజాప్రతినిధులు, పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న మార్కెట్‌యార్డ్ చైర్‌పర్సన్

ఓటరు నమోదుపై ప్రత్యేకదృష్టి : ఆర్‌డిఓ

ప్రజాశక్తి - గాండ్లపెంట

ఓటరు నమోదుపై బిఎల్‌ఒలు, విఆర్‌ఒలు ప్రత్యేక దృష్టి సారించాలని కదిరి ఆర్‌డిఒ వంశీకృష్ణ ఆదేశించా రు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో గురువారం ఆర్‌డిఒ ఓటరు నమోదుపై నిర్వహించిన సమావేశంలో ఆర్‌డిఒ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఇంటింటికీ వెళ్లి 18 ఏళ్లు పైబడిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయించాలన్నారు. ఏ ఒక్క అప్లికేషన్ పెండింగ్‌లో ఉంచరాదని, ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. తహశీల్దార్ పరిశీలనలో ఉంటారని తెలిపారు. సమావేశంలో తహశీల్దార్ హమీద్‌బాషా, డిప్యూటీ తహశీల్దార్ ముకుంద, విఆర్వోలు ఎస్.అమానుల్లా, చంద్రశేఖర్‌రెడ్డి, చెన్నకేశవులు, హబీబ్‌బాషా, వెంకటరమణ, జయరాములు, బిఎల్‌ఒలు తదితరులు పాల్గొన్నారు.

4 నుంచి విద్యార్థి సంఘాల సైకిల్‌జాతా

పుట్టపర్తి క్రైమ్ : విద్యారంగ సమస్యల పరిష్కారానికై డిసెంబర్ 4 నుంచి విద్యార్థి సంఘాల జెఎసి ఆధ్వర్యంలో జరుగుతున్న జిల్లా వ్యాప్త సైకిల్ జాతాను జయప్రదం చేయాలని విద్యార్థి సంఘాలు కోరాయి. ఈ మేరకు గురువారం స్థానిక టిడిపి కార్యాలయంలో మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డితో కలిసి వారు సైకిల్ జాతా గోడపత్రికలను విడుదల చేశారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎ జిల్లా అధ్యక్షులు నరసింహ, ఎఐఎస్‌బి జిల్లా కార్యదర్శి పోతులయ్య, ఆర్‌ఎస్‌వైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు అరుణ్ కుమార్, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి నిరంజన్‌యాదవ్, నాయకులు రంజిత్, సుబహాన్, రవి, కుళ్లాయప్ప, లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి - చిలమత్తూరు

ఇటీవల నిర్వహించిన ఎన్ఎంఎస్ఎస్ మాదిరి పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు గురువారం గ్లోబల్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో బహుమతులు ప్రదానం చేశారు. ప్రతి పాఠశాలలో ఉత్తీర్ణత సాధించిన ముగ్గురికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ నాగేంద్ర, హెచ్ఎం వివేకానంద్, శంకర్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలి

ప్రజాశక్తి-అమరాపురం

వాల్మీకులకు అన్ని రాజకీయ పార్టీలు ప్రాధాన్యత కల్పించాలని రాష్ట్ర వాల్మీకి సంఘం కార్యదర్శి తమ్మడేపల్లి అనిల్‌కుమార్ కోరారు. అమరాపురంలో గురువారం వాల్మీకుల రాజకీయ ఎదుగుదలపై సమావేశం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వాల్మీకి కులస్తులు 2 లక్షల పైచిలుకు ఓటర్లు ఉన్నారని, అయినా రాజకీయ ఎదుగుదల లేక చాలా వెనుకబడి ఉన్నామన్నారు. ప్రస్తుత రాజకీయాల్లో రాణించేందుకు అందరూ ఏకం కావాలని పిలుపునిచ్చారు. పార్టీలకతీతంగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ స్థానాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర వాల్మీకి సంఘం కార్యవర్గ సభ్యులు మంజునాథ్, మండల వాల్మీకి సంఘం అధ్యక్షుడు నిజ లింగప్ప, దయానంద, చిరంజీవి, నరసన్న, అనిల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కొత్తసాఫ్ట్‌వేర్‌తో తగ్గిన రిజిస్ట్రేషన్లు



చిలమత్తూరులోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

తగ్గు ముఖం పట్టిన కొనుగోళ్లు
ప్రభుత్వ ఆదాయానికి గండి

ప్రజాశక్తి - చిలమత్తూరు

ప్రభుత్వం రిజిస్ట్రేషన్ల శాఖలో కొత్తగా తీసుకొచ్చిన సాఫ్ట్‌వేర్‌తో సమస్యలు పెరిగాయి. సాఫ్ట్‌వేర్ 2.0 ప్రైంతో రిజిస్ట్రేషన్ల సంఖ్య సగానికి పైగా తగ్గిపోయింది. సాఫ్ట్‌వేర్‌లో నూతనంగా తీసుకొచ్చిన నిబంధనల నేపథ్యంలో కొనుగోలుదారులకు, అమ్మకందారులకు సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ప్రభుత్వం ఇటీవల భూముల విలువలు, రిజిస్ట్రేషన్ విలువ అమాంతం పెంచేయడంతో ఖంగుతిన్న అమ్మకం, కొనుగోలు దారులు కొత్త సాఫ్ట్‌వేర్‌తో అవస్థలు పడుతున్నారు. దీంతో ఎప్పుడు నిండుగా ఉండే సబ్ రిజిస్ట్రర్ కార్యాలయం వెలవెలబోతోంది. గతంలో ఉన్న 1.0, 2.0 సాఫ్ట్ వేర్ లో చిలమత్తూరు సబ్ రిజిస్ట్రర్ కార్యాలయ పరిధిలో రోజు వారి 50 నుండి 80 వరుకు రిజిస్ట్రేషన్లు జరిగేవి. అయితే ప్రభుత్వం ఈ నెల 21 వ తేదీన కొత్త సాఫ్ట్‌వేర్ తీసుకొచ్చింది. అప్పటి నుంచి 30 వ తేదీ వరకు అంటే పది రోజులలో కేవలం 107 రిజిస్ట్రేషన్లు మాత్రమే నమోదు అయ్యాయి. సగటు రెండు రోజులలో పూర్తి అయ్యే లావాదేవీలు పది రోజులు పడుతుంది. దీంతో పడిగాపులు కాయలేక కొనుగోలు దారులు, అమ్మకం దారులు ఇబ్బందులు పడుతున్నారు.

కొత్త సాఫ్ట్‌వేర్‌తో ఇబ్బందులు

కొత్త సాఫ్ట్‌వేర్ 2.0 ప్రైంలో లీజ్ రిజిస్ట్రేషన్‌కు అవకాశం లేదు. అలాగే డాక్యుమెంట్ క్యాన్సిల్ ఆప్షన్ లేదు,ఎనీవేర్ రిజిస్ట్రేషన్ అవకాశం లేదుజ పెండింగ్ రిజిస్ట్రేషన్ అవకాశం లేదు. వీటి ప్రభావంతో రిజిస్ట్రేషన్ల సంఖ్య తగ్గింది. దీని కారణంగా ప్రభుత్వానికే వచ్చే ఆదాయానికి భారీగా గండిపడినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా కర్నాటక బార్డర్ ఏరియా కావడంతో చిలమత్తూరులో అధికంగా లేఅవుట్లు ఉన్నాయి. ఈ లేవుట్ల యాజమానులు ఎక్కువగా బెంగుళూరుకు చెందిన వారు ఉన్నారు. గతంలో ప్లాట్ల రిజిస్ట్రేషన్ బాగా జరిగేది. అయితే ప్రతి రిజిస్ట్రేషన్‌కు యాజమాని రిజిస్ట్రేషన్ కార్యాలయానికి రావల్సిందే. అయితే రిజిస్ట్రేషన్ పక్రియకు ఎక్కువ సమయం పట్టడంతో వారి రాక బాగా తగ్గింది.

పాత సాఫ్ట్‌వేర్‌ను కొనసాగిస్తేనే ఆదాయం

కొత్త సాఫ్ట్‌వేర్‌తో రిజిస్ట్రేషన్ల సంఖ్య సగానికి పైగా తగ్గింది. ప్రభుత్వం కొత్త సాఫ్ట్‌వేర్ 2.0 ప్రైంను సత్యసాయి జిల్లాలో పైలెట్ ప్రాజెక్ట్ కింద అమలు చేశారు. ఈ ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా రిజిస్ట్రేషన్ల సంఖ్య తగ్గుముఖం పట్టినట్లు తెలుస్తోంది. అనంతపురం జిల్లాలో పాత సాఫ్ట్‌వేర్ 1.0, 2.0 కొనసాగుతోంది. గతంలో ఈ రెండు సాఫ్ట్‌వేర్ల లోను రిజిస్ట్రేషన్లకు అవకాశం ఉండేది. ఇపుడు కేవలం ఒక్క 2.0 ప్రైం లో రిజిస్ట్రేషన్ పక్రియ చేస్తున్న కారణంగా ఎక్కువ సమయం అవుతుండటంతో రిజిస్ట్రేషన్ల సంఖ్య తగ్గింది. గతంలో లాగే పాత సాఫ్ట్‌వేర్లతోనే రిజిస్ట్రేషన్లకు అవకాశం ఇవ్వాలని అమ్మకం, కొనుగోలుదారులు కోరుతున్నారు.

నిర్వాసిత రైతులకు న్యాయం చేయండి : సిపిఎం

వార్త మెయిన్‌పేజీలో..



నాసన్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న నాయకులు, నిర్వాసితులు

ఘనంగా భక్త కనకదాసు జయంతి



పెనుకొండలో కనకదాసు విగ్రహానికి పూలమాల వేసి నివాళలర్పిస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

ప్రజాశక్తి-పెనుకొండ

కురుబల ఆరాధ్య దైవం భక్త కనకదాసు జయంతి సందర్భంగా గురువారం పట్టణంలోని కనకదాసు విగ్రహానికి ఎమ్మెల్యే శంకరనారాయణ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్థానిక వైసిపి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. టిడిపి కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారథి కనకదాసు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి రొద్దం నరసింహులు, జిల్లా కార్యదర్శి చిన్నవెంకటరాముడు, టౌన్ కన్వీనర్ రవిశంకర్, పాలడుగు చంద్ర, బోయ నాగరాజు, పోతిరెడ్డి, ప్రభంజనకుమార్, వరప్రసాద్, నాగప్ప, ఆదిశేషు, బెల్లం శివశంకర్, ఆవుల నరేంద్ర, షీప్‌ఫారం చంద్ర, శేఖర్, గాంధీ, అక్కులప్ప, శివ పాల్గొన్నారు. టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ తన కార్యాలయంలో కనకదాసు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు మాధవనాయుడు, వెంకటరమణ, రాంపురం సర్పంచి శ్రీనివాసులు, సూర్యనారాయణ, డివి.ఆంజనేయులు, శ్రీరాములు, అంజనప్ప, డ్వాక్రా రామాంజనేయులు, సుబ్రహ్మణ్యం, త్రివేంద్ర, మారుతి, బాబుల్‌రెడ్డి, కోనాపురం సుబ్బు, మంజునాథ్, దాదు, నాగభూషణ, వాసుదేవరెడ్డి, వీరచిన్న, మల్లికార్జున, బాబు, వెంకటేష్, శివ, రాము, రవి, పోతన్న, గోవిందప్ప, తదితరులు పాల్గొన్నారు.

మడకశిర : పట్టణంలోని బాలాజీ నగర్ టిడిపి కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో కనకదాసు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ కనకదాసు అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కురుబ సంఘం నాయకులు కోట్ల రంగయ్యగౌడ్, ఆమిదాల గొంది గిరి, పట్టణ అధ్యక్షుడు మనోహర్, మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

బుక్కపట్నం : కురుబ సంఘం జిల్లా అధ్యక్షులు సామకోటి ఆదినారాయణ ఆధ్వర్యంలో స్థానిక కనకదాసు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘం నాయకులు మాట్లాడుతూ కురుబల సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ కురుబ ఆరాధ్య దైవం భక్త కనకదాసు జయంతి వేడుకలు జరుపుకోవడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో శివానంద, ఆదినారాయణ, కిష్టప్ప, ప్రవీణ్, ఈశ్వరయ్య, నారాయణస్వామి, మంజునాథ్, మహేష్, నాగరాజు పాల్గొన్నారు.

బత్తలపల్లి : స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ఎపి కురుబ కార్పొరేషన్ ఛైర్మన్ కోటి సూర్యప్రకాష్‌బాబు ఆధ్వర్యంలో కనకదాసు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కప్పల నాగన్న, రాము, కమతం మహేష్, సురేష్, కోటి చంద్ర, గంటాపురం అప్పస్వామి, బండి నాగభూషణ, ఆంజనేయులు, పెదయ్య, కురుబ సంఘం నాయకులు పాల్గొన్నారు.

హిందూపురం : కనకదాసు జయంతి వేడుకలను గురువారం కురుబ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వైసిపి ఇన్‌చార్జ్ దీపిక స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న కనకదాసు విగ్రహానికి, ముదిరెడ్డిపల్లిలో కనక దాసు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కురుబ సంఘం నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి

కేంద్రమంత్రి నిర్మల సీతారామన్



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్

ప్రజాశక్తి గోరంట్ల

కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి లబ్ధిదారుడు సద్వినియోగం చేసుకోవాలని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ తెలిపారు. గురువారం సత్యసాయి జిల్లా గోరంట్ల పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్పయాత్రలో ఆమెతో పాటు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, ఎమ్మెల్యే శంకర్‌నారాయణ, జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు పాల్గొన్నారు ఈ సందర్భంగా కేంద్ర ఆర్థిక మంత్రి మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు వివరించారు. భారతదేశంలో స్వచ్ఛ భారత్ మిషన్ కింద 11 కోట్ల మరుగుదొడ్లు నిర్మించడం జరిగిందన్నారు. ప్రధానమంత్రి ఉజ్వల యోజన కింద భారతదేశమంతటా 10 కోట్ల మందికి గ్యాస్ కనెక్షన్లు అందించామని ఆంధ్రప్రదేశ్లో ఐదు లక్షల మందికి ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు ఇచ్చామని చెప్పారు. దేశంలో ప్రతి పేదవాడు మందులకు ఎక్కువ ఖర్చు చేయకుండా కేంద్ర ప్రభుత్వం జనరిక్ ఔషధ కేంద్రాలు కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ నిర్మించిన సాయి హీరా గ్లోబల్ కన్వెన్షన్ సెంటర్‌ను విసి ద్వారా ప్రధానమంత్రి మోడీ పుట్టపర్తిలో ప్రారంభించారన్నారు. బెంగళూరు నుండి విజయవాడకు కలుపుటకు ఎకనామిక్ కారిడార్లలో సత్య జిల్లాలోని పలు మండలాలను అనుసంధానం చేస్తూ సిక్స్ లైన్ జాతీయ రహదారి ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. డ్వాక్రా సంఘాల మహిళలు వారి జీవనోపాధి మెరుగుపరుచుకుంటూ స్వయం ఉపాధి పొందడానికి రుణాలు అందించి ప్రతి మహిళను లక్షాధికారి చేయడమే లక్ష్యమన్నారు. అనంతరం వ్యవసాయ శాఖ, ఉపాధి, గృహ నిర్మాణ, ఐసిడిఎస్ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్ ను కేంద్ర మంత్రి పరిశీలించారు ఈ కార్యక్రమంలో ఆర్డీవో భాగ్యరేఖ, తహశీల్దార్ రంగనాయకులు, ఎంపీడీవో రఘునాథ్ గుప్తా, సర్పంచి సరోజ నాయక్, మండల అధ్యక్షురాలు ప్రమీల, బిజెపి జిల్లా అధ్యక్షులు జిఎం శేఖర్, జెడ్పీటీసీ జయరాం నాయక్‌తో పాటు అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

నాసన్ అకాడమీని సందర్శించిన కేంద్ర మంత్రి

గోరంట్ల రూరల్ : మండల పరిధిలోని పాలసముద్రం వద్ద ఏర్పాటవుతున్న నాసన్ అకాడమీని గురువారం కేంద్ర, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రులు నిర్మలా సీతారామన్, బుగ్గన రాజేంద్రనాథ్ సందర్శించారు. భవన నిర్మాణ పనులను మరింత వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే వివిధ పనుల ప్రగతి, ప్రారంభోత్సవంపై నాసన్ అధికారుల బృందంతో సమీక్షించారు. అనంతరం చంద్రయాన్‌పై ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన క్విజ్ పోటీల విజేత విద్యార్థులకు కేంద్ర మంత్రి బహుమతులు ప్రదానం చేశారు. వారి వెంట జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, తదితరులు ఉన్నారు.

తూతూ మంత్రంగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

పుట్టపర్తి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం గురువారం తూతూమంత్రంగా సాగి గంట లోపే ముగిసింది. చైర్మన్ తుంగ ఓబుళపతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో 2024-25కు సంబంధించి రూ. 9.64 కోట్ల అంచనా నిధులను కౌన్సిల్ ఆమోదం కోసం ఉంచారు. కౌన్సిలర్ సూర్యగౌడ్ మాట్లాడుతూ పన్నులు రాబట్టడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. కార్మికులకు పూర్తి స్థాయిలో పరికరాలు అందించి పారిశుధ్యాన్ని మెరుగుపరచాలన్నారు. కౌన్సిలర్ సాయిగీత మాట్లాడుతూ తాగునీరు, తదితర సమస్యలపై ప్రజలకు సమాధానం చెప్పలేకపోతున్నామన్నారు. వైస్ ఛైర్మన్ తిప్పన మాట్లాడుతూ షెడ్యూల్ కులాలకు కేటాయించిన నిధులను ఎక్కడ ఖర్చు చేశారని ప్రశ్నించారు. కౌన్సిలర్ అనిత మాట్లాడుతూ కర్నాటక నాగేపల్లి నుంచి బుక్కపట్నం వెళ్లే రహదారి గుంతలమయమై ప్రమాదాలు జరుగుతున్నాయ న్నారు. కౌన్సిలర్ చెరువు భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ సంతలు, చెరువుల వేలం పాట నిధుల వసూలుపై చర్యలు తీసుకోవాలన్నారు. కౌన్సిలర్ వెంకటరమణ మాట్లాడుతూ గోకులంలో రోడ్లపైనే చెత్తాచెదారం ఉందని డస్ట్ బిన్లు ఏర్పాటు చేయాలన్నారు. స్పందించిన కమిషనర్ రామ్‌భూపాల్‌రెడ్డి సభ్యులు వ్యక్తం చేసిన అంశాలను పరిశీలించి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశానికి 8 మంది కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జనవరి 5లోపు ఓటర్ల తుది జాబితా

పుట్టపర్తి రూరల్ : జనవరి 5వ తేదీ లోపు ఓటర్ల తుది జాబితా విడుదల చేస్తామని డివిజినల్ పరిపాలనా ధికారి షేక్‌జిలాని తెలిపారు. జాబితా తయారీపై బూత్ లెవెల్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జనవరి 2024 నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవా లన్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు బూత్ స్థాయి ఏజెంట్లను నియమించు కోవాలన్నారు. తప్పు లు లేని ఓటరు జాబితా తయారు చేయాలని తహశీ ల్దార్లను ఆదేశించారు. అన్ని డిగ్రీ కాలేజీల్లో స్వీప్ ప్రోగ్రాం నిర్వహించి యంగ్ ఓటర్లను నమోదు చేయాలన్నారు. డిసెంబర్ 2, 3 తేదీల్లో ప్రత్యేక ఓట రు నమోదు కార్యక్రమం ఉంటుందన్నారు. ఓటరు జాబితాలో అభ్యంతరాలు ఉంటే డిసెంబర్ 26వ తేదీలోపు తెలియజేస్తే, వాటిని పరిష్కరించి జనవరి 5వ తేదీ తుది ఓటర్ల జాబితా విడుదల చేస్తామన్నా రు. వైసిపి నుంచి రంగారెడ్డి, టిడిపి నుంచి బేకరీ వెంకటనాయుడు, బిజెపి నుంచి ఎస్.రామాంజనే యులు, సి.పి.ఐ నుంచి పి.ఆంజనేయులు, గౌస్‌లా జం పాల్గొన్నారు. సమావేశంలో పుట్టపర్తి మున్సిపల్ కమిషనర్ శ్రీరామ్‌భూపాల్, తహశీల్దార్లు కరణం నవీన్‌కుమార్, కరుణాకర్, దేవేంద్రనాయక్, ఎన్నికల డిప్యూటి తహశీల్దార్ కందే నరసింహులు, మనోజ్‌కు మార్ రెడ్డి, హరి, రహిమాన్, సునీల్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ధర్మవరం జట్లు



బాస్కెట్‌బాల్ బాలికల జట్టుతో అసోసియేషన్ సభ్యులు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

రాష్ట్ర స్థాయిలో డిసెంబర్ 1 నుంచి 3వ తేదీ వరకూ చిత్తూరు నగరంలో జరిగే 4వ అండర్-16 రాష్ట్ర రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌లో ధర్మవరం బాల, బాలికల జట్లు పాల్గొంటాయని ధర్మవరం బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు మేడాపురం రామిరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఆత్మీయ ట్రస్ట్ ఛైర్మన్ శెట్టిపి జయచంద్రారెడ్డి, కార్యదర్శి వాయల్పాడు హిదయతుల్లా, కోచ్ సంజయ్ తెలిపారు. పట్టణంలో గురువారం వారు మాట్లాడుతూ ఎంపికైన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించి ధర్మవరం పట్టణానికి మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. **బాలికల జట్టు :** సల్మా (కెప్టెన్), కిరణ్మయి (వైస్ కెప్టెన్), నిఖ్య, నిఖిత, వైష్ణవి, జేజియా, మధు శ్రీ, యశస్విని, అంజున, అర్చన, శృతిహాసన్, అలేఖ్య.

బాలుర జట్టు : విజయ్ (కెప్టెన్), జీవన్ (వైస్ కెప్టెన్), అశోక్, కార్తీక్, లక్ష్మీనరసింహ, రవితేజ, నంద, యేసురత్న, సాయిసంతోష్, ఉమా మహేష్, యాజ్‌బుద్ధ, మోక్షిత్.

బుక్కపట్నం ఇన్‌ఛార్జి సబ్ రిజిస్ట్రార్‌గా గౌరమ్మ

బుక్కపట్నం : బుక్కపట్నం ఇన్‌ఛార్జి సబ్ రిజిస్ట్రార్‌గా గౌరమ్మ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న సబ్ రిజిస్ట్రార్ అత్తార్ ఆకస్మికంగా సెలవుపై వెళ్లడంతో కదిరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పని చేస్తున్న గౌరమ్మను ఇన్‌ఛార్జిగా నియమించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నూతనంగా రూపొందించిన 2.0 విధానం ద్వారా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ సేవలు నిర్వహిస్తామని, ఈ విషయాన్ని క్రయ విక్రయదారులు గమనించాలని సూచించారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న హౌసింగ్ ఎస్ఇ వెంకటరెడ్డి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను వేగవంతం చేయాల్సిన బాధ్యత సచివాలయ సిబ్బందిపై ఉందని విజయవాడ అర్బన్ హౌసింగ్ ఎస్ఇ వెంకటరెడ్డి ఆదేశించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో గురువారం గృహనిర్మాణాలపై సచివాలయ అమినిటీ సెక్రటరీ, విఆర్ఒలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా జగనన్న కాలనీల్లో చేపట్టిన గృహ నిర్మాణాలను శరవేగంగా పూర్తి చేయాలన్నారు. ధర్మవరం అర్బన్‌లో లబ్ధిదారుల వద్దకు వెళ్లి అవగాహన కల్పించి 6,116 ఇళ్ల నిర్మాణాలను జనవరి 30వ తేదీలోగా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, హౌసింగ్ ఇఇ శంకర్, ఎఇ బాలాజీ పాల్గొన్నారు.

చిలమత్తూరు : జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని ఎంపిడిఒ నరేష్‌క్రిష్ణ ఆదేశించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం ఆయన ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, విఆర్ఒలు, హౌసింగ్ సిబ్బందితో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. జనవరి 30వ తేదీ లోపు వంద శాతం గృహ నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి టెక్నికల్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల ప్రస్తావన లేని కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి-కదిరి టౌన్

కదిరి మున్సిపాలిటీలో ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నా కౌన్సిల్ సమావేశంలో ఏమాత్రం లేవనెత్తకుండా ముగించడం పట్ల తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ సమావేశం హాలులో గురువారం కదిరి ఛైర్‌పర్సన్ నజీమ్‌ఉన్నిసాసాదిక్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ప్రారంభం కాగానే సమస్యలపై ప్రస్తావన లేకుండా అజెండాలోని 9వ అంశాన్ని తిరస్కరిస్తూ మిగిలిన అంశాలన్నింటినీ ఏకగ్రీవంగా తీర్మానం చేస్తున్నట్లు కౌన్సిలర్లు ముక్తకంఠంతో తెలిపారు. కౌన్సిలర్ షబ్బీర్ మాట్లాడుతూ పట్టణంలో అభివృద్ధి కుంటుపడిందని విమర్శించారు. కౌన్సిలర్ ఇస్మాయిల్ మాట్లాడుతూ మున్సిపల్ కాంట్రాక్టు సిబ్బంది పని చేయకుండా కేవలం సంతకాలు చేసి వెళ్లిపోతున్నారని ఫిర్యాదు చేశారు. సమావేశంలో కమిషనర్ శ్రీహరిబాబు, కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

3న యుటిఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశం

పెనుకొండ : ఈ నెల 3వ తేదీ హిందూపురంలో నిర్వహిస్తున్న యుటిఎఫ్ జిల్లా రెండవ కౌన్సిల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం ఆయన జిల్లా కార్యదర్శి ఈ.నారాయణస్వామి, మండల నాయకులతో కలిసి పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో సమావేశ ఆహ్వానపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉపేంద్ర, జి.రమేష్, నరేష్, గంగాధర్, ఆదిజినేష్, ఖాదర్‌వలి, నరసింహుడు, రామాంజనేయులు, సుబ్బరాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలపై వేధింపులకు పాల్పడితే చర్యలు

అగళి : మండలంలో ఎస్సీ, ఎస్టీలపై అత్యాచారాలు, వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని తహశీల్దార్ జమానుల్లాఖాన్ హెచ్చరించారు. మండల పరిధిలోని ఇరిగేపల్లి గ్రామంలో ఆర్‌డిటి బిల్డింగ్ వద్ద గురువారం దళిత సముదాయం ప్రజలతో కలిసి సివిల్ రైట్స్‌పై సమావేశం నిర్వహించారు. గ్రామంలోని హోటల్, దేవాలయాల్లోకి తమను రానిస్తున్నారని, ఏ సమస్యలూ లేవని గ్రామస్తులు, మహిళలు తెలిపారు. కార్యక్రమంలో ఎఎస్ఐ బషీర్, ఆర్ఐ గుర్రన్న, విఆర్ఒలు దొడ్డే గౌడ, వరలక్ష్మి, చంద్రమౌళి పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం లెక్కింపు

కదిరి టౌన్ : పట్టణంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం హుండీల్లోని ఆదాయాన్ని గురు వారం లెక్కించారు. 57 రోజులకు గానూ నగదుగా రూ. 74,02,262, అమెరికా డాలర్స్ 183, ఖతార్లు-50. రియాన్స్ వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ గోపాలక్రిష్ణ, ఇఒ వెండిదండి శ్రీనివాస రెడ్డి, హుండీ పర్యవేక్షణాధికారిగా నరసింహరాజు, ఎస్‌బిఐ మేనేజర్ పి.ఫణికుమార్ పాల్గొన్నారు.



అనాథాశ్రమంలో అన్నదానం చేస్తున్న దాసరి సురేష్

పిల్లల్లో సేవాతత్వం పెంపొందించాలి

ధర్మవరం టౌన్ : పిల్లల్లో సేవాతత్వం పెంపొందించాలని మానవ హక్కుల పరిరక్షణ సంస్థ హెచ్ఆర్ సిసిఐ ధర్మవరం డివిజన్ ఇన్‌ఛార్జి ఛైర్మన్ దాసరి సురేష్ సూచించారు. సురేష్ గురువారం తన కుమార్తె మోక్షిత రాయల్ జన్మదిన వేడుకలను మండల పరిధిలోని గొట్లూరు అనాథ శరణాలయంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సునీత, దీక్షిత్ రాయల్, మోక్షిత రాయల్, గణేష్, దేవరకొండ చంద్రశేఖర్ పాల్గొన్నారు

చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యం

మడకశిర : రాష్ట్రం అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి తెలిపారు. 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా గురువారం వారు మండల పరిధిలోని కోడిగేపల్లి పంచాయతీ నల్లాయనపల్లి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, పట్టణ అధ్యక్షుడు మనోహర్, కల్లుమర్రి సర్పంచి నాగరాజు, కృష్ణమూర్తి, మల్లికార్జున, రఘురాం, రవీంద్రారెడ్డి, గోపాల్, నాయకులు, పాల్గొన్నారు.

'ఉపాధి' సిబ్బందితో సమీక్ష

ప్రజాశక్తి-బత్తలపల్లి

తాడిమర్రి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపిడిఒ విజయలక్ష్మి ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. తాడిమర్రిని కరువు మండలంగా ప్రకటించి తరుణంలో ప్రతి గ్రామ పంచాయ తీలో అడిగిన ప్రతి ఒక్కరికీ పనులు కల్పించాలని, 2024-25కి సంబంధించి కొత్త పనులను గుర్తించాలని ఆదేశించారు. ముఖ్యంగా అమృత్ సరోవర్ పనులు, చిన్న, సన్న కారు, ఐదెకరాల లోపు ఉన్న రైతుల భూముల్లో పండ్ల తోటల పెంపకం, ఫారం పాండ్ నీటి కుంటల పనులు గుర్తించాలన్నారు. సమావేశంలో ఎపిఒ సంజీవరెడ్డి, ఇంజినీరింగ్ కన్సల్టెంట్ అశోక్‌కుమార్‌రెడ్డి, ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడమే లక్ష్యం

ప్రజాశక్తి-బత్తలపల్లి

గ్రామస్థాయిలో క్రీడాకారులను ప్రోత్సహించాలనే సదుద్దేశంతోనే సిఎం జగన్ 'ఆడుదాం-ఆంధ్రా' పోటీలు నిర్వహిస్తున్నారని ఎంపిపి బగ్గిరి త్రివేణి, జడ్పిటిసి కోటి సుధ పేర్కొన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం ఎంపిడిఒ సాయిమనోహర్ అధ్యక్షతన గ్రామ సచివాలయాలకు మంజూరైన క్రీడా కిట్లను పంపిణీ చేశారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు ఆటవిడుపుగా కొద్దిసేపు కార్యాలయ ఆవరణలో క్రీడా పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీదేవి, అధికారులు మల్లికార్జున, చిన్నసూరి, కార్యదర్శులు నారాయణస్వామి, అలివేలుమంగమ్మ, పద్మావతి, అశోక్‌కుమార్, నాయకులు బండి నాగభూషణ, సలీం, ముసలప్ప, లింగమయ్య పాల్గొన్నారు.

నంబులపూలకుంట : గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులను వెలికితీసేందుకే ప్రభుత్వం 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమాన్ని చేపట్టిందని ఎంపిడిఒ ఆదినారాయణ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ నుంచి క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, తదితర క్రీడలను గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ నిర్వహిస్తారని, కావున గ్రామాల్లోని 15 ఏళ్ల పైబడిన ఆసక్తిగల బాల, బాలికలు గ్రామ, వార్డు సచివాలయం, గ్రామ వాలంటీర్ వద్ద పేరు రిజిస్ట్రేషన్ చేసుకొని, పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు.

టిడిపి ఆధ్వర్యంలో గుంతల రోడ్ల పరిశీలన

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండల పరిధిలోని మాగేచెరువు పంచాయతీలో గుంతలు పడిన రోడ్లను గురువారం టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి సవితమ్మ స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే శంకర నారాయణ మంత్రిగా పనిచేసినా నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. అడుగడుగునా గుంతల రోడ్లే దర్శనమిస్తున్నాయన్నారు. కొత్తపల్లి క్రాస్ నుంచి రైల్వేస్టేషన్, అడదాకులపల్లి, ఎల్‌జిబి నగర్ వరకూ రోడ్డు ఏర్పాటుకు భూమిపూజ చేశారే కానీ పనులు ప్రారంభించలేదని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా అభివృద్ధి శిలాఫలకాలకే పరిమితమైందన్నారు. ఇకనైనా వైసిపి ప్రభుత్వం కళ్లు తెరిచి రోడ్లు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఆమె వెంట నాయకులు డివి.ఆంజనేయులు, వెంకటరమణ, సర్పంచి నరసింహమూర్తి, బాబయ్య, జెసిబి ప్రభాకర్, రంగనాథ్, మురళి, గుడిపల్లి రంగప్ప ఉన్నారు.

10న ఉచిత కంటి వైద్యశిబిరం

ధర్మవరం టౌన్ : పేద ప్రజలకు సేవ చేయడమే రోటరీ క్లబ్ లక్ష్యమని అధ్యక్షులు జయసింహ, కార్యదర్శి నాగభూషణ, కోశాధికారి సుదర్శన్‌గుప్తా తెలిపారు. ఈ నెల 10వ తేదీ పట్టణంలో నిర్వహించే ఉచిత కంటి వైద్య శిబిరం కరపత్రాలను గురువారం వారు స్థానిక రోటరీ క్లబ్ కార్యాలయంలో విడుదల చేశారు. . కార్యక్రమంలో క్లబ్ సభ్యులు నరేంద్రరెడ్డి, వెంకటేశ్వర్లు, గట్టు హరినాథ్, రమేష్, బోనాల శివయ్య, దాసరి కార్తీక్, పాల్గొన్నారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవ వేడుకలు

రొద్దం : మండల పరిధిలోని కంబాలపల్లి గ్రామంలో గురువారం అధికారులు, నాయకులు రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాజ్యాంగ పరిరక్షణకు, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయాల సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రాబర్ట్ విల్సన్, తహశీల్దార్ అనంతాచారి, పంచాయతీ కార్యదర్శి మోహన్, విఆర్ఒ రాము, సచివాలయాల కన్వీనర్ రవిశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

కదిరి టౌన్ : రూరల్ మండల పరిధిలోని కుమ్మరవాండ్లపల్లికి చెందిన వల్లెపు శివయ్య రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సిద్ధారెడ్డి కదిరి ఏరియా ఆసుపత్రి వద్దకు చేరుకొని మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అతడి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 10 వేలు అందజేశారు. ఎమ్మెల్యే వెంట కౌన్సిలర్ రంగారెడ్డి ఉన్నారు. అలాగే వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ బత్తల హరిప్రసాద్ శివయ్య కుటుంబ సభ్యులకు రూ. 10 వేలు అందజేశారు. ఆయన వెంట సైదాపురం రమణ, సంపంగి గోవర్ధన్, రమేష్, బలపాల చంద్ర ఉన్నారు.

11,12 తేదీల్లో జిల్లాస్థాయి కళాఉత్సవ్ పోటీలు

బుక్కపట్నం : 9, 10 తరగతులతో పాటు ఇంటర్ విద్యార్థులకు ఈ నెల 11, 12 తేదీల్లో ఉమ్మడి అనంతపురం జిల్లా స్థాయి కళా ఉత్సవ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ డా.ఎస్.రామకృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు పి.లక్ష్మీనారాయణ 94409 44737, ఇ.సురేష్ బాబు 94405 13218 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

3న కార్తీక వనభోజన మహోత్సవం

బుక్కపట్నం : రాయలసీమ బలిజ మహా సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 3వ తేదీ అనంతపురం నగరంలో నిర్వహిస్తున్న కార్తీక వనభోజన మహోత్సవంలో బలిజ కులస్తులు పాల్గొని జయప్రదం చేయాలని కాపు సంక్షేమ సేన ఉపాధ్యక్షుడు పత్తి చంద్రశేఖర్ పిలుపునిచ్చారు.

ఈఎస్ వెంకటేష్‌కు పితృవియోగం

పుట్టపర్తి రూరల్ : సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్‌కు పితృ వియోగం కలిగింది. అతడి తండ్రి ఈడిగ పెద్దన్న(92) అనారోగ్యంతో 25 రోజులగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందారు. అతని స్వగ్రామమైన కనగానపల్లి మండలం శివపురం గ్రామంలో అంతక్రియలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పెద్దన్నకు భార్యతో పాటు నలుగురు కుమారులు, ఐదుగురు కూతుర్లు ఉన్నారు. పెద్దన్న మతి పట్ల సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, నాయకులు ప్రవీణ్, లక్ష్మీనారాయణ, బ్యాళ్ల అంజి, హనుమయ్య, వెంకటేష్, బాబావలి, పలువురు నాయకులు సంతాపం తెలిపారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

లేపాక్షి : మండల పరిధిలోని బిసలమనేపల్లి గ్రామంలో లేపాక్షి గ్రామానికి చెందిన గంగాధర్ (35) అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. భార్య నేత్రావతి ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి మృతదేహాన్ని హిందూపురం ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. భార్య తెలిపిన వివరాలు.. గంగాధర్ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. అతడికి భార్య, ఓ కూతురు ఉంది. 6 నెలల నుంచి పావగడ తాలూకా రాగికుంట గ్రామానికి చెందిన ఓ మహిళతో కలిసి బిసలమనేపల్లిలో అద్దె ఇంటిలో ఉంటున్నారు. రెండురోజుల క్రితం భార్య పలుమార్లు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చిందని, ఇంతలోనే గ్రామస్తులు సమాచారం ఇవ్వడంతో బంధువులతో కలిసి వెళ్లి చూడగా ఆ ఇంట్లో గంగాధర్ అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉన్నట్లు తెలిసింది.

వైసిపితోనే అభివృద్ధి, సంక్షేమం : ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి

ప్రజాశక్తి-కదిరి టౌన్

రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం వైసిపి ప్రభుత్వంతోనే సాధ్యమని ఎమ్మెల్యే డాక్టర్ పివి. సిద్ధారెడ్డి పేర్కొ న్నారు. మున్సిపాలిటీ పరిధిలోని రాజీవ్‌గాంధీనగర్ వార్డు సచివాలయంలో గురువారం నిర్వహించిన 'వై ఎపి నీడ్స్ జగన్' కార్యక్రమం ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ జగన్ సిఎం అయిన తర్వాత కులమతాలు, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు ఇంటి వద్దకే అందాయన్నారు. ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్, వైస్‌ఛైర్మన్లు, కౌన్సిలర్లు, అధికారులు, కోఆప్షన్ సభ్యులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే గెలిపిస్తాయి

ధర్మవరం టౌన్ : సిఎం జగన్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే వైసిపిని మరోమారు అధికారంలోకి తీసుకొస్తాయని మున్సిపల్ ఛైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి ధీమా వ్యక్తం చేశారు. పట్టణంలో చేపట్టిన 'వై ఎపి నీడ్స్ జగన్' కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై వైసిపి జెండాను, సంక్షేమ పథకాల ప్రదర్శన బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ వేముల జయరామిరెడ్డి, కౌన్సిలర్లు పెనుజూరు నాగరాజు, మాసపల్లి సాయికుమార్, వార్డుల ఇన్‌ఛార్జులు కృష్ణాపురం జమీర్ అహ్మద్, చాంద్‌బాషా, నాయకులు పాల్గొన్నారు.

అమరాపురం : మండల పరిధిలోని హేమావతి గ్రామ సచివాలయంలో సర్పంచి తిప్పే స్వామి ఆధ్వర్యంలో 'వై ఎపి నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సంక్షేమపథకాల బోర్డ్‌ను, వైసిపి జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జడ్పిటిసి స్వారక్క నరసింహమూర్తి, ఎంపిపి ఈరన్న, శ్రీనివాస్ రెడ్డి, శివకుమార్, రసూల్‌బాషా, ఇఒఆర్‌డి నాగముని, పంచాయతీ కార్యదర్శి నరేష్, పాల్గొన్నారు.

బత్తలపల్లి : మండల పరిధిలోని సంజీవపురం సచివాలయంలో సర్పంచి కమతం వరలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన 'వై ఎపి నీడ్స్ జగన్' కార్యక్రమంలో ఎంపిపి బగ్గిరి త్రివేణి, జడ్పిటిసి కోటి సుధ పాల్గొన్నారు. వారు ముందుగా సంక్షేమ పథకాల ప్రదర్శన బోర్డును, వైసిపి జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సాయిమనోహర్, పంచాయతీ కార్యదర్శి నారాయణ, ప్రసాద్, సర్పంచి గోపాల్, వైసిపి మండల కన్వీనర్ మాదిరెడ్డి జయరామిరెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, గొల్లపల్లి రామకృష్ణారెడ్డి, గుర్రం వనజ, కమతం రశ్వరయ్య, గుర్రం శ్రీనివాస రెడ్డి, బగ్గిరి బయపరెడ్డి, కోఆప్షన్ మెంబర్ కరీంసాబ్, నాయకులు సంజీవు, వెంకటప్ప, పూలమంది ఈశ్వరయ్య, కెసి.ఈశ్వరయ్య, లింగానా యుడు, నారాయణస్వామి, రామాంజనేయులు, ఈశ్వరయ్య, గంగాధర్, రామకృష్ణ, ముసలప్ప పాల్గొన్నారు.

హిందూపురం : టిడిపి అధ్య చంద్రబాబు నాయుడు ఎన్ని జిమ్మిక్కులు చేసిన, కుట్రలు, కుతంత్రాలు పన్నినా ప్రజలు నమ్మే పరిస్థితి లేరని స్థానిక నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త దీపిక భర్త, ఆ పార్టీ నేత గుడ్డంపల్లి వేణురెడ్డి అన్నారు. వై నీడ్ ఎపి జగన్ కార్యక్రమాన్ని స్థానిక 30వ వార్డులో జరిగింది. ఈకార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ ఛైర్మన్ బలరామిరెడ్డి, కమిషనర్ ప్రమోద్ కుమార్, వార్డు కౌన్సిలర్ గిరి, జెసిఎస్ కన్వీనర్ శివ శంకర్ రెడ్డి, కాణిపాకం టెంపుల్ డైరెక్టర్ రవీంద్రుడు, కౌన్సిలర్లు మణి, రోషన్ అలీ, జయప్ప, షాజియ, జెసిఎస్ కన్వీనర్ నౌషద్, వార్డు ఇన్‌ఛార్జులు డిష్ చాంద్ బాషా, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.